
# సింగిల్ పేజి కథలు

## అంతరాలు



ఓ కార్పొరేట్ కంపెనీలో కొత్తగా మేనేజర్ ఉద్యోగంలో చేరిన శశిధర్‌కి అది మొదటి ఆఫీస్ బోర్డ్ మీటింగ్!

ఇంటర్‌కం మోగడంతో విసుగ్గా ఫోన్ తీసి "ఏంటండి? ఓ అరగంట వరకు ఎటువంటి కాల్స్ ఇవ్వద్దని చెప్పాగా?" కోపంగా అన్నాడు శశిధర్ రిసెప్షనిస్ట్‌తో.

"సారీ సార్! ఈ కాల్ మీ ఇంటి నుండి మీ శ్రీమతిగారు చేసారు. చాలా అర్జంటట!"

సరేనని ఫోన్ తీసి "హలో!" అన్నాడు.

"ఏమండీ!" ఏడుస్తూ అంది శ్రీలక్ష్మి.

"ఏమైంది? ఎందుకేడుస్తున్నావ్? త్వరగా చెప్పు బోర్డు మీటింగ్‌లో ఉన్నాను!"

"మరి..మరి..మన గుండుబాబు కన్పించడం లేదండి!"

నెత్తిన పిడుగు పడ్డట్టు అన్పించింది తనికి.

"ఎప్పటి నుండి?"

"గంట నుండి, ఇంటి బయట ఆడుకుంటున్నాడు కదా అని నేను ఇంటి పనుల్లో పడిపోయాను. పనయ్యాక చూస్తే కన్పించడం లేదు. చుట్టుపక్కల వారి అందరిళ్ళలో చూసాను. కానీ మన గుండు కన్పించడం లేదండి. నాకు భయమేస్తోంది!"

ఇటు చూస్తే మీటింగ్, అటు చూస్తే గుండుబాబు మిస్సింగ్..ఏం చెయ్యాలి? బోర్డు మెంబర్స్‌కు సారీ చెప్పి, పరిస్థితి వివరించి ఇంటికి బయలుదేరాడు శశిధర్ హుటాహుటిన.

* * *

"అలాగా! ఎప్పటి నుండి?" ప్రశ్నించాడు ఎస్సయ్ శశిధర్ని.

"రెండు గంటల నుండి" విషాదంగా శ్రీలక్ష్మి సమాధానం.

"ఎందుకండి, పిల్లల్ని అలా నిర్లక్ష్యంగా వదిలేస్తారు. సంవత్సరంలో 44 లక్షల మంది పిల్లలు కిడ్నాప్ అయ్యో తప్పిపోవడమో జరుగుతోంది. మీ నిర్లక్ష్యం మీకు మిగిలించే వ్యధ కాకుండా మాకూ రిస్కే. టీవీల్లోనూ, పేపర్లలోనూ చూడటం లేదా పిల్లల్ని ఎత్తుకుపోయేవారి గురించి? సరే కంప్లైంట్ రాసివ్వండి వెతుకుతాం. ఈలోగా మీకేదైనా ఆచూకీ దొరికితే మాకు తెలుపండి"

శశిధర్, శ్రీలక్ష్మి చెరో మూలన తలపట్టుకుని కూర్చున్నారు.

"మన గుండు బాబు దొరుకుతాడంటావా?" దిగులుగా ప్రశ్నించాడు శశిధర్.

"దొరికి తీరాలండి మన గుండు! వాడేం ఊరికే పుట్టాడా? గుండ దేవర కోనకు 10 కిలోమీటర్లు అదీ వట్టి కాళ్ళతో నడుచుకుంటూ వెళ్ళి, స్వామివారికి మొక్కుకుని మూడు రోజుల ఉపవాసమున్న తర్వాత మూడు నెలలకు నా కడుపులో పడ్డాడు. అందుకే నాజూకైన ఎంత లేటెస్ట్ పేర్లున్నా, తలమీద బోలెడు వెంట్రుకలున్నా గుండుదేవరకు కృతజ్ఞతగా గుండు అని పేరెట్టాం!" ముక్కు చీదుతూ వెక్కిళ్ళ పొత్తిళ్ళ మధ్య అంది శ్రీలక్ష్మి.

ఇంతలో ఫోన్ మోగింది!

"ఫోనొచ్చిందీ అంటే మన గుండుబాబు ఆచూకీ తెలిసి పోలీసు వాళ్ళు ఫోన్ చేసారేమో?" అంటూ ఫోన్ తీసింది శ్రీలక్ష్మి.

"హలో ఎవరూ?"

"ఖాసిందాదా!"

"బెండకాయ దాదాయేం కాదూ! మా గుండు కన్పించక మేం ఏడుస్తోంటే!" వింటున్న శ్రీలక్ష్మి చేతిలో నుండి ఫోన్ లాక్కుని "ఎవరు? ఏం కావాలి?" ఆదుర్దాగా అడిగాడు శశిధర్.

"మీ గుండు కన్పించడం లేదు కదూ!"

"అవును!"

"మీ గుండు మా చేతుల్లో ఉన్నాడు. వాడు మీకు కావాలంటే మూడు లక్షలు మాకు ఇవ్వాలి. అదీ ఇరవై నాలుగ్గంటల్లో. పోలీసులు, గీలీసులు అంటూ వెధవ్వేషాలు వేసారో..మీ గుండు మీకు దక్కడు ఖబడ్దార్!"

"అలాగే...అలాగే ఆ డబ్బులు సర్దుతాం. మా గుండును ఏమీ చేయకండి. ఇంతకూ డబ్బు తీసుకుని ఎక్కడికి రావాలి?"

"ఊరవతల ఉన్న స్మశానానికి, అదీ అర్ధరాత్రి దాటాక?" ఫోన్ డిస్‌కనెక్టయింది.

"మూడు లక్షలే! అంత డబ్బు అదీ ఇరవై నాలుగ్గంటల వ్యవధిలోనే! ఎలాగండి సర్దడం?"

"ఏం చేద్దాం? గుండుబాబు దక్కాలంటే తప్పదు. నీకున్న బంగారం అమ్మేసి, ఈ ఇల్లును ఏ మర్వాడీ దగ్గరైనా తాకట్టు పెడితే అయిదు అటో ఇటో రావచ్చు!"

"పోనీ పోలీసులకు కంప్లైంటిస్తే?"

"రిస్క్.. ఒకవేళ ఆ కరకుగాళ్ళు ఈ విషయం పసిగడితే మన గుండుకే ప్రమాదం. వెధవ డబ్బు పోతేపోయింది. మన బాబు మనకు కావాలి!"

ooo

ముప్పై ఏళ్ళ తర్వాత!

శశిధరకు వృద్ధాప్యం ముసుగేసింది. తన ధర్మమంటూ కాలం శ్రీలక్ష్మిని ఫోటో రూపంలో గోడకు తగిలించేసింది.

గుండు మంచి ఉద్యోగంలో సెటిల్ అవడమే కాదు ఓ ఇంటివాడు అయ్యాడు, పెళ్ళయి ఇద్దర బ్బాయిలు కూడా!

శశిధర్ భాగస్వామి దూరమవడంతో మనవళ్ళే ప్రపంచం అయ్యారు.

వృద్ధాప్యం కోరని కోరికగా కొన్ని తీవ్ర అనారోగ్య సమస్యల్ని ఉచితంగా ప్రసాదించిందతనికి.

ఓ రోజు!

"గుండుగారూ! మీకు ఫోన్!" అని ప్యూన్ చెప్పడంతో తన సీట్లోంచి లేచివెళ్ళి ఫోన్ తీశాడు.

"హలో! ఏవండి?" అవతల నుండి తన భార్య జయంతి గొంతు విన్పించింది.

"ఏమైందే? ఆ ఏంటా కంగారు?"

"మావయ్యగారు కన్పించడం లేదండి"

"ఛ..ఊరుకో! ఆయనేమన్నా చిన్న పిల్లడా తప్పిపోవడానికి. ఎవరైనా కిడ్నాప్ చేయడానికి. తన ఈడు వారితో ఎక్కడో బాతాఖానీ వేసుకుంటూ కూర్చొనుంటార్లే!"

"ఏం కబుర్లండి బాబూ! ఉదయం 11 గంటల నుండి కనిపించడం లేదు. మధ్యాహ్నానికి భోజనానికీ రాలేదు. నాకెందుకో భయంగా ఉంది!"

"వచ్చి నేనేం చెయ్యాలే! కాసేపు ఆగు ఆయనే వస్తారు. మళ్ళీ ఓ గంటాగి ఫోన్ చెయ్ అప్పటికీ రాకుంటే వస్తాను!"

గంట తర్వాత మళ్ళీ ఫోనొచ్చింది గుండుకు!

"ఏంటి ఇంకా రాలేదా? ఆగు పర్మిషన్ తీసుకుని వచ్చేస్తాను!"

* * *

"ఏంటో ఈ ముసలోళ్ళు...పెట్టింది తిని క్రిష్ణా..రామా! అనుకుంటూ ఓ మూల కాలు చాపుకోక ఇవేం పనులూ?" కోపంగా అన్నాడు గుండు.

"ఏమో బాబూ! నిజంగా మీ నాన్నగారు ఇంటికి తిరిగి రాకపోతే కోడలు ఏ రాచి రంపాన పెట్టిందో, ఇల్లు విడిచి పోయారంటే అని దుమ్మెత్తిపోస్తుందండి లోకం!"

ఇంతలో ఫోన్ మోగింది.

"ఈ ముసలాయన దారితప్పి దిక్కు తెలియక ఫోన్ చేసుంటాడు" అనుకుంటూ ఫోన్ తీసాడు గుండు.

"హలో..నేను పంబాగ్రూపు నాయకుణ్ని!"

"అయితే ఏంటట?"

"మీ నాన్న శశిధర్ని మేం కిడ్నాప్ చేసాం! ఇరవై నాలుగ్గంటల్లో అయిదు లక్షలిస్తే వదిలేస్తాం..లేదంటే చంపేస్తాం!"

"మా నాన్న శశిధర్ని మీరు కిడ్నాప్ చేసారా? అయిదు లక్షలు ఇవ్వాలా? తొక్కేం వద్దూ? ఆయన మాకు అవసరం లేదు. మీరే ఉంచుకుని పెంచుకోండి. ఆ ముసలిప్రాణం విలువ అయిదు లక్షలా? అసలే రోగిష్టి మనిషి. ఆయనగారి మందులకు, డాక్టర్ల ఫీజులకు వందలు వదులుతున్నాయి. ఎలా వదిలించుకోవాలో అర్థంకాక ఇంత కాలం లోకానికి భయపడి భరించాము. ఇప్పుడా పుణ్యమేదో మీరే కట్టుకోండి. డబ్బేం చెట్లకు కాస్తున్నాయా? కోసి ఇవ్వడానికి? అర్థరాత్రి ఆయాసంతో పాటు దగ్గు మొదలెట్టారంటే మీ చెవుల్లో రక్తం కారడం ఖాయం!" అంటూ గుండు ఏదేదో మాట్లాడుతున్నాడు.

గోడకు వేలాడుతున్న శ్రీలక్ష్మి ఫోటో మాత్రం దీనంగా రోదిస్తున్నట్లుంది.

**-లక్ష్మీ భారతీ రెడ్డి (కువైట్)**

ooo




"కాఫీ" అంటూ శ్రీమతి కేక పెడుతున్నా వినిపించుకోకుండా పేపరుబోయ్ పేపరేసాడేమోనని వీధి గుమ్మంలోకెళ్ళాడు హనుమంతు.

కాషాయ వస్త్రాలు ధరించిన నలుగురు వ్యక్తులు రసీదు పుస్తకాలు పట్టుకుని తన ఇంటివైపు రావడం గమనించి 'హరి నాయనో!..ఎవరో చందాకోసం వస్తున్నట్లుంది. వీళ్ళుగాని అలివేణి కంటబడ్డారో తన కొంప కొల్లేరే' అనుకుంటూ గభాలున లోపలకొచ్చి దభాలున తలుపేసుకున్నాడు.

అతడలా హడలిపోడానికి కారణం తెలుసుకోవాలనుకుంటే ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్ళవలసిందే.

హనుమంతు అలివేణి మెడలో తాళి కట్టి నేటికి ఏడేళ్ళవుతోంది. తను ఎలా వున్నా ఆమె మాత్రం అందాలరాశి. అపరంజిబొమ్మే. అందుకే కాణీకట్నం లేకుండా పెళ్లి చేసుకున్నాడు. పెళ్లైన తొలిదినాల్లో దైవం పట్ల ఆమెకున్న భక్తిశ్రద్ధల్ని చూసి మురిసిపోయాడు. బీద బిక్కి పట్ల ఆమె కనపరిచే జాలికి చలించిపోయాడు. అయితే రాను రాను ఆమెలోని దయార్ద్రగుణాలు తన జేబుకి చిల్లులు చేయడంతో కాస్త ఇబ్బంది పడ్డాడు. ఏ అనాథ అయినా ముంగిట్లోకొచ్చి కట్టుకోడానికి ఓ కోక ధర్మం చేయండమ్మా అంటే చాలు ముందు వెనుక చూడకుండా వంటిమీద చీర ఒలిచి ఇచ్చేస్తుంది. మొన్నటికి మొన్న ఎవరో అన్నదానం చేస్తున్నామంటే వాళ్ళకి వెచ్చాలతోపాటు భారీగా డబ్బులు కూడా ముట్టచెప్పింది. దానగుణంలో ఇల్లాలు కర్ణుణ్ణి మించిపోవడంతో జీతంలో సగం దానధర్మాలకే సరిపోతోంది.

ఆమె చేసేవి మంచిపనులే కావడం వల్ల తను అడ్డు చెప్పలేకపోతున్నాడు. అలా అని మనసుండబట్టక ఎప్పుడైనా కాస్త పొదుపుగా ఉండవే అంటే చాలు. "మనకి పిల్లా పీచూ ఎవరున్నారని చెప్పండి మూటగట్టి ఇవ్వడానికి" అంటుంది. నిజమే తనకి పిల్లలు లేకపోవచ్చు. తామిరువురూ బతకడానికైనా డబ్బుండాలా? ఇంకా ఏమైనా అంటే మనం ఇప్పుడు అంతో ఇంతో ధర్మం చేస్తే రేపు అంతకు పదింతలు అదే వచ్చి పడుతుందంటుంది. మరి ఇటువంటి ఇల్లాలిని ఇబ్బంది పెట్టకుండా తను ఇబ్బంది పడకుండా ఉండాలంటే కొన్ని చిట్కాలు తెలిసుండాలి. అయితే అవి మన హనుమంతులో పుష్కలంగానే ఉన్నాయిలెండి. అందుకే నెగ్గుకు రాగలుగుతున్నాడు.

"పొద్దున్నే తలుపు బిడాయించేస్తే కూరలవాడి కేక ఎలా వినిపిస్తుందండి" అన్నది అలివేణి భర్త చేష్టలకు అబ్బురపడుతూ.

అంతలోనే తలుపు దభీ దభీమంది.

గుండె దడదడ లాండిది హనుమంతుకి.

"ఎవరో చూడండి" అంది అలివేణి.

అయిష్టంగానే తలుపు తెరిచాడు హనుమంతు.

ఇంకెవరు? వాళ్ళే..రసీదు పుస్తకాలు పట్టుకుని యమకింకరుల్లా నిలబడ్డారు.

ముఖం చిట్లిస్తూ ఏం కావాలన్నట్లు చూసాడు హనుమంతు.

"రామాపురంలో రాముడి దర్శనార్థం వచ్చే యాత్రీకుల కోసం ఓ ధర్మ సత్రం కట్టించాలని సంకల్పించాం. అందుకు దేశమంతా తిరుగుతూ చందాలు పోగుచేస్తున్నాం" అన్నారు వచ్చిన వాళ్ళు.

"ఎక్కడో మీరు సత్రవ కడితే ఇంత దూరం వచ్చి మమ్మల్ని చందాలడగడం సబబుగా లేదు" అన్నాడు హనుమంతు.

పెనిమిటి మాటలు విన్నదేమో "అదేమిటండీ అలా అంటారు. మంచి పని ఎవరు ఎక్కడ చేసినా అంతా సహకరించాలి. అంతటి బృహత్తర కార్యక్రమాన్ని వాళ్ళు తలపెట్టినప్పుడు మనం వాళ్ళని ఉత్తచేతులతో పంపిస్తే పాపం కదూ! ఓ వెయ్యి రూపాయలు తక్కువ కాకుండా రాయండి" అంది అలివేణి దగ్గరకొచ్చి.

ఆ మాటతో రసీదు పుస్తకం ఇస్తూ ఎంతో ఆశగా చూసారు వచ్చినవాళ్ళు.

"పిచ్చిదానా! వారు తలపెట్టిన ఈ మహాయజ్ఞానికి వెయ్యి రూపాయలు ఏం సరిపోతాయే" అన్నాడు హనుమంతు.

భర్త తను అన్నదానికంటే ఎక్కువ మొత్తంలో విరాళమివ్వడానికి సిద్ధపడుతున్నాడని తెలిసి ఎంతగానో సంతోషించింది అలివేణి.

"యాత్రికుల కోసం మీరెన్ని అంతస్తుల భవనం కట్టాలనుకుంటున్నారు" అడిగాడు హనుమంతు.

"మూడు" ఠక్కున సమాధానమిచ్చాడు వాళ్ళలో ఒకడు.

"ఒక్కో అంతస్తుకి ఎంత అవుతుందని మీ అంచనా?"

"ఎంతలేదన్నా పదిహేను లక్షలవుతుంది"

"అయితే నేను మూడో అంతస్తు కట్టించే పూర్తి బాధ్యత తీసుకుంటాను సరేనా?" అన్నాడు హనుమంతు.

పెనిమిటి మాటలకు ఆనందంతో ఉప్పొంగిపోయింది అలివేణి.

వెంటనే రసీదు పుస్తకం అందించారు వాళ్ళు.

"ఊహూ ఇప్పుడు కాదు మీరు రెండతస్తులు వేసేకా నన్ను కలవండి, మూడో అంతస్తు నేను దగ్గరుండి కట్టిస్తాను"

ఆ మాటకు వాళ్ళు ఏమనుకున్నారో ఏమో మరి కిమ్మనకుండా జారుకున్నారు.

తర్వాత వాళ్ళు మరి రాను లేదు. తను ఆ అంతస్తు కట్టనూ లేదు.

**-దూరి వెంకటరావు (విజయనగరం)**